ఆమె జీవితము

పట్టణంనుంచి భానుమతి వచ్చిందని విన గానే ఒకసారివెళ్లిచూసి రావాలని నేను ఎంత ఆవేదనపడ్డానో చెప్పలేను. ఒకసారి వెళ్లి కొంచెముసేపు మాట్లాడి, ఆయన పొలం నుంచి తిరిగి వచ్చేలోపుగా వచ్చేద్దామని త్వరత్వరగా యింటిపనులు చేసుకోవటం మొదలుపెట్టాను. మనస్సు భానుమతి దగ్గరకు పరిగెడుతోంది.

ఒకరోజా స్నేహమా, రెండు రోజుల స్నేహమా! ఏడుసంవత్సరాల కాలము విడిపోకుండా లతలు అల్లుకుపోయినట్లు అల్లుకుపోయాయి మా హృదయాలు. 'మీ రిద్దరూ కవలపిల్లలా!' అని అడిగేవారు చాలామంది. అంతదగ్గరిపోలిక మా యిద్దరికీ. భానుమతి నాకన్నా గొప్పది; నాకన్న అందమైనది; నాకన్నా చదువుకొన్నది.

ఆరేళ్ళప్పటినుంచి పదహారేళ్లువచ్చేదాకా యిక్కడే వాళ్ళ మేనమామగారింట్లో పెరిగింది. తరువాత పట్టణంలోవున్న తలిదండ్రుల వద్దకు వెళ్ళిపోయింది. ఆ తరువాత కొంతకాలానికి ఆమెతండ్రి పోయారు. తను పెద్దచదువులో పడింది.

నాకు మావూళ్ళోనే వివాహమయింది. అందుచేత నేను గ్రామంలోనే వుండిపోయాను. కొంతకాలమువరకు మా యిద్దరి మధ్యా ఉత్తరాలు నడిచాయి. తరువాత ఎందుచేతనో ఆగిపోయాయి.

నేను యిదరుపిల్లల తల్లినయాను. నాభర్త వ్యవసాయపరీక్ష (బి. ఎస్. సి.) ప్యాసు అయారు. ఆయన చదువుకొన్న దానివల్ల, నేర్చుకొన్న దానివల్ల మాకున్న కొద్దిభూమిని ఆధునిక యంత్రాలు వుపయోగించి సాగుబడి చేస్తున్నారు. మా జీవితాలు అట్టేక్లేశము లేకుండా గడచిపోతున్నాయి.

నాతో సమానవయస్సున్న భానుమతి జీవితము ఎల్లా గడుస్తోందో— ఈ విషయమే అస్తమానూ అనుకొనే దానిని. భానుమతి అప్పట్లో ఒకోసారి ఒకోవిధంగా మాట్లాడేది. 'పెద్ద చదువుచదివి పెద్ద ఉద్యోగము చేస్తా'ననేది ఒకసారి. 'మూడొందలో నాలుగు వందలో సంపాయించే ఓ ఆఫీసరుని పెళ్ళిచేసుకొని హాయిగా సుఖంగా వుంటాను' అనేది యింకోసారి.

'ఉద్యోగమనేది ఓ గొప్ప తప్ప అది కూడా బానిసలా ఒకళ్ళకి లొంగి వుండటమే కదా! ఏమైనాకాని, వ్యాపారస్తుని జీవితమే మంచిది' అనేది మరోసారి. ఈవిధంగా మాట్లాడిన భానుమతి ప్రస్తుతము తన జీవితము ఏ విధంగా గడుపుతోందో తెలుసుకోవాలనుకోవటంలో తప్పేముంది?

మావూళ్లో ఆమెను గురించి వింత వింతగా చెప్పుకొంటున్నారు. భానుమతి ఎం. ఏ ప్యాసుఅయిందనీ, పెద్దఉద్యోగము చేస్తోందని, పెళ్ళయింది కాని పిల్లలు లేరని, పెళ్ళయిన కొద్దిరోజులకే భర్తకు విడాకు లిచ్చేసిందని—యిల్లాగే ఎవరికి తోచినట్లు వారు చెప్పుకుంటున్నారు. దీని కంతకీ కారణము వాళ్ళ నాన్నగారు పోయినప్పటి నుంచి వాళ్ళకుటుంబం వేరే ఊరులో వుండటం సంభవించింది. వాళ్లు యిక్కడే వుండిపోతే చాలా బాగుండి వుండేది. అందుచేతనే యిటువంటి మాటలన్నీ వినాల్సివస్తోం దనుకొన్నాను. వేసంగి సెలవులకి అందరూ గ్రామానికి వచ్చారు రాగానే భానుమతి నాకోసం కబురు పంపింది. ఆమెను చూడాలనే ఆశకన్నా, ఆమె జీవితాన్ని గూర్చి తెలుసుకోవాలనే ఆకాంక్ష నాకు ఎక్కువైంది. ఇంటిపనిఅంతా పూర్తిచేసుకొని భానుమతిని చూడటానికి వెళ్ళాను.

భానుమతి నన్ను చూసి చాలా ఆశ్చర్యపడింది. చంకనున్న ఆడపిల్ల, చెయ్యిపట్టుకొని వున్న మగపిల్లవాడుతో వున్న నన్ను చూసి "చాలా పెద్దసంసారి అయినట్టున్నావే" అంది పరిహాసంగా. చిరునవ్వునవ్వి ఊరుకొన్నాను.

"కూర్చో! ఇప్పుడేవస్తా" అంటూలోపలికి వెళ్ళి రెండు ప్లేట్లతో వేడివేడి బజ్జీలు తెచ్చి ఒక ప్లేటు నాముందుంచింది. తన ప్లేటు

యన్. శ్రీకృష్ణారావు

లోని బజీలకన్నా నా పళ్ళెములోనివి మూడింతలు అధికంగా వున్నాయి.

"ఎందుకిన్ని?" అన్నాను.

"నీకూ నీ పిల్లలకీను" అంది భానుమతి కొంటెగా. నాకు చెప్పలేనంత సిగ్గేసింది. తను చిన్నప్పటినుంచి యిల్లా చిలిపితనంగా మాట్లాడటము మామూలేకదా అని నాలో నేను సముదాయించుకున్నాను. కొంచెము సేపు కుటుంబ యోగక్షేమాలు మాట్లాడుకొన్నాము. నేను ఆమె మెడను పరీక్షించి చూశాను. మాంగల్యము కట్టిన పసుపుతాడో లేక బంగారు తాడో నాకు కనిపించలేదు. ఇంకా కన్యగానే వుందా? లేక పెళ్లయి... అని సందేహ పడ్డాను. ఎన్నాళ్ళు నాకీ విధంగా సందేహమని తననే అడిగేశాను.

"ఇంతకీ నీకు పెళ్లయిందా లేదా?" అన్నాను.

నా ప్రశ్న విన్న వెంటనే యిల్లెగిరిపోయేటట్లు నవ్వటం మొదలెట్టింది. నాకు కోపం వచ్చింది. "నేనడిగిందానికి యిదేనా సమాధాన"మన్నాను.

"నీగురించి యిక్కడ నలుగురూ నాలుగు విధాలా ఆడిపోసుకొంటున్నారు. నిజం తెలుసుకొందామని నేనడిగితే యిల్లా నవ్వుతావెందుకు. ఎల్లా అయినా చిన్నతనపు చిలిపి చేష్టలు నీకు యింకాపోలేదు." ఈ మాటలతో భానుమతి దారికొచ్చింది.

"నన్నుగురించి నలుగురూ నాలుగువిధాలా ఆడిపోసుకొంటున్నారా? ఏమని లలితా?" ఇదే సరైన సమయమని నేను విన్నవాటికి మరి నాలుగు కల్పించి మరీ చెప్పాను. చాలా ఓపిగా విని మళ్ళీ నవ్వటము ప్రారంభించింది.

నాకు చాలా కోపం వచ్చింది.—

"సరే! నువ్వుతీరుబడిగా నవ్వుకో! నేను వెళ్ళొస్తా!" అంటూ లేచాను.

"కూర్చో లలితా! కోప్పడకు, నీమాటలు నాకు అంత నవ్వు తెప్పిస్తున్నాయి. నువ్వు విన్నవన్నీ కేవలం కల్పిత కథలు" అంటూ నన్ను చెయ్యిపట్టుకు కూర్చోబెట్టింది భానుమతి.

పోనీ నిజమైన కథ నువ్వే చెప్పరాదూ!" కొంచెము సేపు మౌనము వహించి వచ్చే నవ్వును ఆపుచేసుకొంటూ—.

"నాకు పెళ్ళయింది. కాని నేను కన్యగానే జీవితాన్ని గడుపుతున్నాను" అంది భానుమతి.

"అంటే"

"భర్తకు విడాకు లిచ్చేశాను"

"ఓసి భడవా! నీకిదేం బుద్ధే! కొత్తగా వుందే!"

"భానుమతి కనిపెట్టిన కొత్త!"

"నీ భర్త క్షేమంగా వున్నారా!"

"ఆహా! మహారాజులాగ!"

"మరి, నీ మెడలో......"

"నువ్వో కర్ణాటక మొద్దు! దవాళీబంట్రోతులా మెళ్ళో ఓతాడు వేళ్ళాడుతూంటేనే భర్త వున్నట్లా? నేను చేసుకొన్నది 'రిజిష్టర్ మేరేజ్' విన్నావా ఎప్పుడేనా అటువంటిది ఒకటుందని?"

"నాకేం తెలుసునమ్మా! ఏదో నాలుగు క్లాసులు చ[illegible]ను. పెద్దలంతా చేరి పెళ్లంటూ చేశారు. సంసారంలోపడి ఏదో...రోజులు గడుపుతున్నా?"

"అల్లాగా! భర్తకు లొంగిపోయి జీవితాన్ని గడుపుతున్నావు. నీలాంటి వాళ్లు యింకా నూటికి తొంభయిమంది వుండటం వల్లే ఈ మగాళ్ళకి కళ్ళూ కాళ్లూ కన్పించటంలేదు. ఆడవాళ్లని మృగప్రాయంగా చూస్తున్నారు...కాలిచెప్పుతో చీమలని లిపినట్లు నలిపేస్తున్నారు. ఇటు

★ ఆమె జీవితము ★

వంటి వాళ్లందర్నీ నీలాంటివాళ్ళంతా పతి, భర్త, ప్రత్యక్షదైవము అని ఏమేమో అంటూ వాళ్లని పూజిస్తూ...మీ పిరికితనాన్ని చాటుకొంటున్నారు" అంది భానుమతి ఉద్రేకంగా.

"లేకపోతే నీలాగా బరి తెగించాలంటావా?"

"బరి తెగించటమా! నువ్వు ఎక్కడో మూలనున్న అడివిలో వున్నట్లు మాట్లాడుతున్నావు. ఇది ఇరవయ్యో శతాబ్దం. సామర్థ్యాన్ని చూపి మన జీవితాలకు మనమే సారథ్యం వహించవలసిన రోజులు"

"అయితే అందరూ నీ సామర్థ్యాన్ని పరీక్షించుకొంటున్నారన్న మాట!"

"సందేహమేముంది.? ఆనాడు చూడవల్సింది కోర్టులో ఆ కోలాహలాన్ని. పత్రికలన్నీ తెగపొగిడాయి పట్టణమంతా అల్లకల్లోలమయింది."

"అదంతా అల్లా వుండనీ! నీబుద్ధి యిల్లా పోతోందేం?"

"అదొక పెద్దగాథ. నీకిప్పుడేమీ తొందరపని లేదంటే చెప్తాను. లేకపోతే రేపు చెప్తాను."

మరేం ఫర్వాలేదు యిప్పుడే చెప్పు. ఆయన అయిదున్నరకుగాని పొలాన్నుంచి రారు. ఈలోపుగా చెప్తే చాలు"

భానుమతి చెప్పటం ప్రారంభించింది—

2

"కాలేజీలో ఇందిర నాకు ప్రాణస్నేహితురాలు. 'హృదయాలు కలసిపోయాయి. వారి శరీరాలు రెండయినప్పటికీ ఆత్మ ఒక్కటే. ఒకరిని విడచి ఒకరు వుండలేరు. వారి అన్యోన్యభావంలో మనస్పర్థలకు తావేలేదు' అంటూ ఏదో, కవులు రాస్తూంటారే అల్లాగే వుండేవాళ్ళము. అంత దూరము ఎందుకు—అప్పట్లో మనిద్దరము ఎల్లా వుండేవాళ్ళము? అల్లాగన్నమాట!

ఒకరోజున నేనూ ఇందిర సముద్రపొడ్డున కూర్చొని సరదాగా మాట్లాడుకొంటున్నాము. మా సంభాషణ మెల్లిగా పెళ్ళిళ్ళ మీదకు మళ్లింది. 'నే నసలు పెళ్ళే చేసుకోదల్చుకోలేదు' అన్నాను నేను. 'అది నా వల్లకాదు భానుమతీ! అమ్మ, నాన్న యిష్టానికి వ్యతిరేకంగా నేను నడవలేను. వాళ్లు చెప్పినట్లు నేను వినితీరాలి! పరీక్షలవటంతో నా పెళ్ళి చేయటానికి నిశ్చయించుకొన్నారు,' అంది ఇందిర.

ఇంక మా సంభాషణ యీ కాలపు భర్తల మీదకు మళ్లింది.

'నీకు రాబోయే భర్త నీ యిష్ట ప్రకారం రావటం లేదు. నువ్వు చూడకుండానే నీ వాళ్ళు నీకీసంబంధాన్ని ఖాయపరిచారు. ఖర్మవశాత్తు నిన్ను నీ భర్త అష్టమైన హింసలూ పెడితే ఏం చేయగలుగుతావు?'

'పూర్వకాలపు వాళ్ళమాదిరిగా నడచుకొని, తప్పుదారి పట్టిన నా భర్తను మంచిదారికి తీసుకురావటానికి ప్రయత్నిస్తాను. సాధ్యం కాకపోతే 'విధి' అనుకొని సహించుకొంటాను.'

నేను ఇందిరను హేళన చేశాను. తను యీ నవయుగంలో వుండతగది కాదన్నాను. నేనే అయితే భర్తతో దెబ్బలాడి చక్కటి గుణపాఠము నేర్పుతానన్నాను. నేర్చుకోకపోతే విడాకులిచ్చేస్తాను, అన్నాను.

'ఇదంతా కేవలము వట్టి భ్రమ భానుమతీ! మాటలన్నీ ఆ మూడుముళ్ళూ పడేవరకే! ఆ తర్వాత నువ్వూ అందరిమాదిరిగానే లొంగుతావు బుట్టలో పెట్టిన పాములా. ఇంకో విషయం భానుమతీ! దాంపత్యంలో భర్త భార్యకు లొంగాలని, భార్య భర్తకు లొంగాలనీ అనుకోవటం కేవలం మూర్ఖత్వము. దాంపత్యమనేది రెండుచక్రాలబండి. రెండు చక్రాలు కదిలితేనే బండి ఏవిధంగా సాగుతుందో అదేవిధంగా భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని జీవితాలను గడిపితే దాంపత్యం స్వర్గమయమవుతుంది. అంతేగాని ఒకరికొకరు లొంగివుండాలనో లేక అణిగివుండాలనో అనుకోకూడదు' అంది ఇందిర.

నాకు కోపము వచ్చింది.

'ఇందిరా! భానుమతి అంత సామాన్యమైనదని అనుకోకు. చూస్తున్నావుగా నేటి గృహలక్ష్ముల గతి; ఇరవై నాలుగు గంటలూ, వంటిల్లుదాటి బయటకు రావటానికి వీలేని మహిళలస్థితి! ఇదంతా పురుషులు చేసే అన్యాయం కాదా? నా స్వంతవిషయంలో నే కాదు! ఏ స్త్రీవిషయంలోనైనా సరే పురుషుడు అన్యాయం చేస్తే సహించను. దెబ్బలాడి విజయాన్ని సాధించి పెడతాను. ఇందుకే నేను యిదివరలో చెప్పిన మహిళా సమాజాన్ని స్థాపించబోతున్నాను' అన్నాను ఆవేశంగా.

ఇందిర ఏమనుకుందోగాని ఇంక మాట్లాడలేదు. అంతటితో మా సంభాషణకూడా ముగిసింది. ఎవరియిళ్లకు వాళ్లము వెళ్ళిపోయాము.

ఇంటికి వచ్చిన దగ్గర్నుంచి నామనస్సేమీ బాగుండలేదు. ఆరాత్రి భోజనముకూడ సరిగా చేయలేదు. ఆ స్తమానూ, నేనూ, ఇందిర మాట్లాడిన విషయాలే జ్ఞాపకానికి వచ్చాయి. ఇందిర చెప్పింది నిజమా? నేను చెప్పింది నిజమా? అన్న సమస్యే నన్ను చాలా బాధించింది. ఆలోచనలతో సతమతమయిన నాకు అర్ధరాత్రి దాటిన తరువాత ఎప్పుడో నిద్రపట్టింది...

* * *

3

నామాటల్లోనే కనివుందని చెప్పాలి. పాపము! ఆతరువాత నెలలే, అనుకొన్న సంబంధంతోనే ఇందిరకు వివాహము జరిగింది. ముచ్చటగా మూణ్ణెల్లుకూడ కాపురం చేయలేదు ఇందిర. ఆరితేరిన పోకిరి అయిన తనభర్త తనని అష్టకష్టాల పాలుచేశాడు



ఆ కొంచెం కాలంలోనే ఇందిర భర్త తాగుబోతు జూదగాడు వ్యభిచారి ఇందిర నగలన్నీ తాగుడుకి, జూదానికి, వేశ్యలకు బలి అయిపోయాయి రానురాను ఇందిర జీవితం దుర్భరమయిపోయింది. చాలా వరకు ఓర్చుకొంది ఇందిర. చిట్టచివరి దశలో తన తలితండ్రులకు తెలియపరిచింది. కాని ఆదశలో వారుమాత్రము ఏం చేయగలుగుతారు. మనోవర్తి దావా తప్ప వేరే శరణ్యము లేదు ఒక వేళ దావా వేసినా పరువు నష్టం, డబ్బుదండగ తప్ప వాడి దగ్గరనుంచి ఏమీ వసూలు కాదని తెలుసుకొని 'మనమ్మాయి చేసుకొన్న పుణ్యం యింతే' అనుకొని నోరుమూసుకూర్చున్నారు చేతకాని దద్దమ్మలు.

ఉద్యోగం నిమిత్తం బొంబాయి వెళ్లి వచ్చిన నాతో తన కథంతా చెప్పుకుని ఏడ్చింది ఇందిర. ఆ సమయంలో తన భర్త నా ఎదురుగా వుండి వున్నట్లయితే అతని హత్య కూడా చేసేదాన్నేమో! నాలో అంత వుద్రేకం కలిగింది. 'ఆనాడు మనము సముద్రపొడ్డున మాట్లాడుకొన్న మాటలు యీనాడు రూపం దాల్చాయి' అన్నాను నేను.

'భానుమతీ!... నా జీవితం... నాశనమయింది. నా ఆశలు ఒక్కటి ఫలించలేదు. 'విధి' అనుకొని రోజులు గడుపుతున్నాను ఆనాడు నువ్వు ఏదో అన్నావే! ఇంక అదొక్కటే మిగిలింది' అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆ ఒక్క మాటతో నన్ను ఒక్క పోటు పొడిచినట్లు చేసింది ఇందిర. కొంచెం సేపు ఆలోచించి, 'ధైర్యంగా వుండు ఇందిరా! భయపడకు భానుమతి అన్నమాట ఎప్పుడూ తప్పదు' అన్నాను.

'నాకేదో ఉపాయంగా మంచి చేద్దామనిపోయి నువ్వు అపాయంలో చిక్కుకోనేవు జాగ్రత్త' అని హెచ్చరించింది ఇందిర.

ఏడుస్తూ నా దగ్గరకు వచ్చిన ఇందిర తన కథంతా నాతో చెప్పుకుని కొంచెము నెమ్మదిపడ్డ హృదయంతో వెళ్లటం చూసి మనసులోని బాధ మరొకరితో చెప్పుకోవటంతో బాధోపశమనము కలుగుతుందన్న దానిలోని సత్యాన్ని ప్రత్యక్షంగా చూశాను ఆనాడు.

ఇందిరకథ నన్ను చిత్రవధ చేసిందంటే- అంతకన్న యింకేమీ చెప్ప నవసరం లేదు. చాలా దీర్ఘంగా ఆలోచించి ఇందిర జీవితాన్ని తిరిగి చిగిరింప చేసేందుకు తగిన ప్లానులు నిర్ణయించుకొన్నాను. ఇందిర భర్త చరిత్ర అంతా విచారించి తెలుసుకొన్నాను.

అతని పేరు గోపాలరావు. చేతిలో పైసా లేకపోయినా పేకదాబులతో మోసగించటంలో పెద్ద డిగ్రీ వున్నవాడే. తను కాపురమున్న వీధిలోనే ఒకగది అద్దెకు తీసుకొని కాలేజీ స్టూడెంటులా నటించటము ప్రారంభించాను. ఆ డాబులరాయుణ్ణి నా అందంతో మైమరపించి వలవేసి పట్టేశాను. కామాంధుడైనవాడవటము చేత ఆ పనేమంత కష్టమనిపించలేదు. వెంటనే చెయ్యి చాచాడు... కామాంధుల తీరే అంతకదా! 'పెళ్ళి చేసుకొంటే తప్ప నువ్వు నన్ను పొందలే'వన్నాను. 'రిజిష్టర్ మారేజీ' చేసుకొందామన్నాడు. హిందూ ధర్మశాస్త్ర ప్రకారము తను నన్ను చేసుకొంటే పదిమందికి తెలిసిపోతుందనుకొన్నాడు. కాని నాకు కావల్సింది "రిజిష్టర్డ్ మారేజీ" అని తెలుకోలేకపోయాడు మూర్ఖుడు.

మా యిద్దరికీ 'రిజిష్టర్డ్ మారేజ్' జరిగిపోయింది రిజిష్ట్రారు దగ్గర తను బ్రహ్మచారేనని ప్రమాణం చేశాడు. నేను తలితండ్రులను కోల్పోయిన మేజరు అవటము వల్ల, నా చదువు హోదావల్ల రిజిష్ట్రారు సందేహ ప్రశ్నలు లేకుండా తప్పించుకొన్నారు.

ఇంక ఆయనగారు ఆ మర్నాటినుంచి నా మీద అధికారము చెలాయించటము ఆరంభించాడు. నా నగలమీద చెయ్యి పెటటానికి కూడా సాహసించాడు. నన్ను బలాత్కారం చెయ్యటానికి కూడా చెయ్యి ఎత్తాడు. కాని నేను అతని చర్యలలో ఒక్కదానికి కూడా అవకాశము యివ్వకుండా సమయానుకూలంగా సమర్థిస్తూ తప్పించుకొన్నాను. క్రమంగా తన స్నేహితులంతా నన్ను వెతుక్కుంటూ రావటం ఆరంభించారు. వాళ్ళకి తగినట్లుగానే నేనూ నాటకము ఆడటం మొదలుపెట్టాను.

ఒక్కొక్కళ్ళతోనూ 'నిన్నే ప్రేమిస్తున్నా'నంటూ ఒకడికి తెలియకుండా ఒకడికి చెప్పాను. గోపాలరావు నా రిజిష్టర్డ్ భర్త అని వీళ్ళకి తెలియదు పాపము! అందుకని అందరూ నన్ను చూసి నోరూరి పల్కిలించేవారు. అందులో యిద్దరు నన్ను పెళ్ళి చేసుకోనేందుకు ముందుకొచ్చారు. ఇదంతా ఒకనాడు కనిపెట్టాడు గోపాలరావు. నన్ను నానా చివాట్లు పెట్టాడు. తిట్టాడు, అంతటితో ఆగకుండా కొట్టాడు. ఆ మర్నాడే అతనిమీద కోర్టులో దావా పడేశాను.

పురుషుడు పెడదారి తొక్కితే తప్పు లేదు యీ సంఘంలో! కాని స్త్రీ పరపురుషుడితో మాట్లాడినా తప్పే. పరస్త్రీతో తన వాంఛను తీర్చుకొంటే పురుషుణ్ని దండించటం చేతకాక, స్త్రీ పరపురుషుడితో కలిస్తే స్త్రీని నిందించి నానా హింసలపాలు చేయటం పరిపాటయిపోయింది యీ మెదడు లేని సంఘానికి సంఘ దౌర్బల్యానికి లొంగటం వెర్రితనం. అర్థం లేని అవకతవక సిద్ధాంతాలతో, అధికార అహంభావాలతో, డబాయింపులతో చలామణీ అయే వివేకవిజ్ఞానం లేని మూర్ఖులే మన సంఘ పెద్దలు. ఉదాహరణకు కాంగ్రెసు సిద్ధాంతం ఏమిటో తెలుసుకోకుండా కాంగ్రెస్ నాయకులుగా చెలామణీ అవుతున్న ప్రబుద్ధులు ఎంతమంది లేరు? అలాగే కొందరు పిలకరాయుళ్ళు శాస్త్రాలని పిక్క వేస్తారు. అల్లా పిక్క వేసిన శ్లోకాలలో ఒక్క శ్లోకానికి అర్థం చెప్పమను చెప్పటం చేతకాక 'ఇల్లా అర్థం చెబుతూ వెళ్లాలంటే చాలాసేపు పడుతుంది, తీరుబడిగా తర్వాత చూద్దాం' అంటారు. మళ్ళీ మనకంటికి కనిపించరు.



ఆమె జీవితము

అదేమాదిరి, నేటి విద్యార్థులలో చాలామంది చదివిన దానిని అర్థం చేసుకోకుండా బట్టీపటి పెద్ద పెద్ద డిగ్రీలు పొందుతారు. చివరకి తమ సొంతంగా ఒక వాక్యంకూడా వ్రాయలేరు. ఇటువంటి వాళ్ళంతా కూపస్థమండూకాలు. ఇటీవల మన ప్రధానమంత్రి ఒకచోట తన ఉపన్యాసంలో చాలా చిత్రమైన విషయము వెల్లడించారు. సర్వీస్ కమిషన్ పరీక్షలలో చాలామంది బి.ఏ, యం.ఏ డిగ్రీలు పొందినవారు కూడా కొన్ని కొన్ని ప్రశ్నలకు అసలు సమాధానాలే రాయలేక పోయారుట. 'భాక్రా నంగల్ డామ్' అంటే ఏమిటో, 'గాంధి' అంటే ఎవరో, 'టాగూరు' అంటే ఎవరో మొదలైన కొన్ని ప్రశ్నలకు సమాధానాలు తెలియక వదలివేశారుట. వారిలో కొంతమంది విద్యార్థులు సాహసం చేసిసమాధానాలు వ్రాశారు. 'భాక్రా నంగల్ డామ్' అనే జపాన్ సైంటిస్టు మొదట అటంబాంబును కనిపెట్టాడని, అది సైబీరియా ఎడారిలో పేల్చబడిందని ఒకరు రాశారుట. గాంధీ సింహళదేశ యువరాజని రాశారుట ఒకరు. టాగూరు ఆఫ్రికా ఖండంలోని అనాగరికులకు మతబోధకుడని రాశారుట మరొకరు.

ఇంక దేనికి వీళ్ళ చదువు? ఎందుకు వాళ్ళకా డిగ్రీలు? ఇటువంటి విజ్ఞానులే మన సంఘపెద్దలు. వీళ్ళే మన రాజ్యాధికారులు. ఇట్టి కూపస్థమండూకాలు, చీడపురుగుల మధ్య పెరిగిన మనకు వాళ్ళ అధికారంలో నీతిన్యాయాలు ఎల్లా లభిస్తాయి? ఈ అప్రయోజక శిఖామణుల పరువులో మన గౌరవాలకే భంగం వాటిల్లుతోంది! వీరికున్న డిగ్రీలను శంకిలకు తగిలించేటట్లు చేసి, వీళ్ళను అణిచేయాలి. లేకపోతే ముఖ్యంగా మన మహిళా జాతిగతి అధోగతే! యీ ఛడితీ ఛాయితే భావిభారత భాగ్యోదయానికి సారథ్యం వహించితే మన బ్రతుకులు సర్వనాశనమవక తప్పవు. పాతివ్రత్యం పేరుతో నారీలోకానికి చీడపురుగులుగా రూపొందుతూ సంఘాభివృద్ధిని అరికడ్తూ, స్వార్థంతో, అభివృద్ధి చెందుతున్నారు. ఇటువంటి వాళ్ళందరికి తగిన గుణపాఠం నేర్పాలంటే మనమహిళలే పూనుకొని పురోగమించాలి. మతానికి, నీతికి, సంఘ మర్యాదకు వుండే భేదాలను తుడిచిపెట్టే నూతన సిద్ధాంతాలను ప్రచారంలోకి తీసుకురావాలి. అప్పుడే యువతీ యువకుల జీవితాలు నిత్యకల్యాణం పచ్చతోరణంగా మారతాయి.

ఇందిర భర్తసౌఖ్యానికి దూరమయింది. అందరూ దాని ఖర్మ అన్నారు. ఆ ఖర్మ అన్నదానిలోనే సమాధానము కూడా వుంది. కాని యీ సంఘ పెద్దలకు అందుకు దమ్ముల్లేవు" అని ఓ ఉపన్యాసం దంచేసింది భానుమతి. ఇదరం కొస్త కాఫీతాగాము.

"తర్వాత" అన్నాను నేను.

భానుమతి మళ్ళీ చెప్పటం ప్రారంభించింది:

"నేను కోరులో దావా వేసిన సంగతి అతనికి తెలియదు. అకస్మాత్తుగా "సమను" రావటముతో నేతల కొట్టేసినంత పనయింది అతనికి. 'పిల్ల బలే గటిదే' అన్నాడట.

ఈ దావావల్ల తను రహస్యంగా రెండవ వివాహము చేసుకొన్నట్లు బయటపడుతుందని, భయపడి ఎక్కడికైనా పారిపోదామనుకొన్నాడు. కాని, తనని నేను ఓకంట కనిపెడుతూనే వున్నట్టు తెలుసుకోవటం వల్ల తన ప్రయత్నం సాగలేదు. ఇంక లాభం లేదనుకొన్నాడు. నాదగ్గరకు వచ్చి, చేసిన తప్పులన్నిటికి క్షమార్పణకోరాడు. కాని తను నన్ను చేసుకోకముందు బ్రహ్మచారినని నటించాడు. తన అహంభావం యింకా చావలేదనీ, తను యింకా సరైన దోవకొరాలేదని, నేను నా దావా విరమించుకోలేదు!

మొదటి హియరింగు జరిగింది. కొద్ది విచారణతో పూర్తయింది. ఇంకో రెండుమూడు విచారణలతో కేసు పూర్తిచేయించాలని నేను తీర్మానించుకొన్నాను. పదిమందిలోనూ తన తప్పులన్నీ బయటపడి తగిన దండన విధింపబడుతుందని భయపడి తను

(48-వ పేజీ చూడండి)

మనోహరమైన కేశములకు సులభమైన కిటుకు

తాతావారి
సుగంధ కొబ్బరి తలనూనె
మరియు షాంపూ

ది తాతా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్

ఆమె జీవితము

(24-వ పేజీ తరువాయి)

ధరైనదారికి రావాలని కదా నా ఆశ! విచారణ మళ్ళీ నెల మూడవ తారీఖుకి వేశారు."

భానుమతి ఓ నిట్టూర్పు విడిచింది.

"తర్వాత" అన్నాను.

"జరగటానికి ఏముంది? జరగవలసినదంతా జరిగింది. ఈ భానుమతికి ఎప్పుడూ ముందడుగే గాని వెనకడుగు లేదుగా!"

"మూడో తేదిన విచారణ జరిగిందా!"

"ఆహా! మేళ తాళాలతో సహా!"

"ఆయన రాజీకు రాలేదా!"

"రాకేం! వచ్చాడు. కాని నా ఆశయం నెఱవేర్చుకోవాలని తీర్మానించుకొన్న తరువాత నేను రాజీకి ఎల్లా ఒప్పుకొంటాను?"

"ఎల్లాగయినా నీది రాతిగుండె. చిన్నప్పుడు ప్రతిదానికీ ఎల్లా మూర్ఖపు పట్టుదల పట్టేదానివో అప్పుడూ అల్లాగే చేశావు...ఊ...తర్వాత..." అన్నాను నేను.

అనుకొన్నట్లుగానే విచారణ జరిగింది. ఇదివరకు జరిగిన హియరింగుకన్నా ఆనాడు కోర్టుకు చాలామంది వచ్చారు. స్త్రీల విషయంలో పురుషులు చేసే అన్యాయాక్రమాలను ఖండిస్తూ ఒకతె వాదిస్తోందని విని వినటానికి వచ్చారు. అతని తరఫున ఒక పెద్ద వకీలు వాదించాడు. నేను ఎవరినీ పెట్టుకోలేదు. బుద్ధి చాతుర్యము, వాక్చాతుర్యము, ధైర్యము నాలో కావలసినంత యిమిడివున్నప్పుడు నాకు యింకో వకీలుకూడా ఎందుకు? నా వాదనలో ఏదైనా 'వీక్ పాయింటు' అంటూ వుంటేగా! అందుచేత నేనే వాదించాను. తను ఇందిర జీవితాన్ని నాశనం చేసినది తప్పు, నన్నూ, యింకా ఇతర అమ్మాయిలను తను చేసిన అన్యాయాక్రమాలను అత్యద్భుతంగా వాదించాను. ఇటువంటి మనిషితో జీవితము నాకు అక్కర్లేదని, విడాకు లిచ్చేసున్నానన్నాను. కోర్టులో వాళ్ళంతా తెల్లబోయారు. ఒక సాధారణ స్త్రీ ఇంతగా వాదించగలిందే అన్నారు. వకీళ్ళంతా బుర్ర లూంచుకున్నారు. ఇంక తనని విచారించవలసినది ఒక్కటే వుందని, అది అతి ముఖ్యమైనదని, అందుకు కావలసిన సాక్షిని కోర్టు వారి ఎదుట హాజరు పరచవలసినదని, అది కూడ పూర్తయిన తరువాత యీ గోపాలరావుకు తగిన దండన విధించవలసినదని, నాకు కావలసిన సాక్షి వివరాలు న్యాయమూర్తికి రాసి యిచ్చాను. న్యాయమూర్తి 'తథాస్తు' అన్నారు.

ఆనాటికి కోర్టు విచారణ ముగిసింది. చెప్పలేని హృదయభారంతో గోపాలరావు యింటికి వెళ్లటం గమనించాను. ఆ రాత్రి తను చాలా బాధపడివుండాలి! ఎందుచేతనంటే ఆ మర్నాడు వుదయము నా దగరకు వచ్చిన గోపాలరావుకు క్రితంరోజు గోపాలరావుకు చాలా వ్యత్యాసముంది. తను చేసిన తప్పులన్నీ క్షమించమని, యికనుంచి నే నెల్లా చెప్తే అల్లాగే నడచుకొంటానని నా కాళ్ళు పట్టుకొని కన్నీళ్లు కార్చాడు. దారికి వచ్చాడని నాలో నేను సంతోషించాను. ఈ మాటలే ఇందిరతో చెప్పి యిద్దరూ కలిసి యిక్కడికి రంపన్నాను. 'ఇందిర' పేరు విని చాలా ఆశ్చర్యపోయాడు.

'ఇం...ది...ర...తెలుసునా!'

'తనూ తెలుసు; తన నాశనమైన జీవితమూ తెలుసు' అన్నాను.

ఏమనుకొన్నాడో ఏమో, నాదగ్గరనుంచి వెళ్ళిపోయి, ఇందిరతోసహా తిరిగి వచ్చాడు.

ఇద్దరూ మతాబు వెలుగులా నూతన వధూవరులలా కన్పించారు. అతని దగ్గర అనేక ప్రమాణాలు తీసుకొని వాటిని దస్తావేజులుగా తయారు చేశాను.

'ఇందిరా! ఇంక నా పని పూర్తయింది. ఆనాడు నేను సముద్రపువడ్డున అన్నమాట నిలబెట్టుకొన్నాను. ఇంక నీ గతి నీ భర్తగతి' అని బయలుదేరాను.

నా వెనకాలే ఇందిర 'భానుమతీ! భానుమతీ' అంటూ వస్తోంది. ఇందిర కేకలు నా చెవులను కొరికివేశాయి.

త్రుళ్ళిపడుతూ గబుక్కున కళ్ళు తెరచి చూచాను. నా పక్కనే రతీదేవిలా ఇందిర నవ్వుతూ నుంచుంది. 'టైము ఎనిమిదయింది. యింకా ఏమిటి నీకీ మొద్దునిద్ర' అంది.

నాలో నేను ఆశ్చర్యపోతూ లేచాను.

* * *

4

"నీకేమో పిచ్చెక్కినట్లుంది!"

"అబ్బే, అటువంటి దేమీలేదు" అంది భానుమతి

"మరి యింతవరకు సరిగా చెప్పి, తుళ్లిపడి లేచాను. ఇందిర నాపక్కనే వుంది. అంటావేం?"

"తొందరపడకు లలితా! పూర్తిగా విను మరి."

ఇందిర మహాసంతోషంతో 'నాన్నగారి దగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది. ఇవాళ నన్ను... పెళ్ళివారు...చూడటానికి... వస్తున్నారుట. నువ్వు యిపుడు నాతోటి రావాలి" అంది.

"ఓసి! భానుమతి! ఎంత అద్భుతమైన కలకన్నావే! అయితే ఇదంతా కలన్నమాట" అన్నాను నేను.

"ఇందిరతో నాకలంతా అప్పుడే చెప్పాలనుకొన్నా. కాని పిల్లను చూడటానికి వచ్చే యీ శుభసమయంలో అష్టకష్టాలతో కూడుకొన్న యీకల చెప్పటము మంచిది కాదనిపించింది. పైగా రాబోయే వరుణ్ణి ఊహించుకుంటూ ఊహాలోకంలో విహరిస్తున్న ఇందిర యిప్పుడు వినగలిగే స్థితిలో కూడ లేదని గ్రహించా. తనతో కూడా వెళ్లాను.

వాళ్లు బొంబాయినుంచి వచ్చారు. ఇరుపక్షాల వారికి పరిపూర్ణతృప్తి వెంటనే. వివాహము కూడా జరిగింది. ఇందిరకు నాకలను కల్లచేసి, సుఖంగా, హాయిగా, శాంతంగా, ఇందిర సంతోషమే తన సంతోషంగా భావిస్తూ, ప్రస్తుతం కలకత్తాలో వున్నారు ఇందిర భర్త ఇందిరతో" అని పూర్తిచేసింది భానుమతి.

"బలేకల కన్నావే! చాలా విచిత్రంగా వుంది. దానికితోడు నాకు ఓ ఉపన్యాసం కూడా ఇచ్చావు. రాత్రి రెండుగంటలనుంచి తెల్లారి ఎనిమిది గంటల లోపుగా ఎన్నెన్ని ఘనకార్యాలు చేశావే! మరి నిన్ను గురించి యీ కథలన్నీ ఎందుకుపుట్టాయి?"

తను నవ్వుతూనే "అదా! ఇందిరతో చెప్పలేని ఆకలను మొదలూ చివరాక త్రిరించి, తలా, తోకా, కాళ్ళు తగిలించి ఓపత్రికకు పంపాను. అది అచ్చయింది. పొరపాటున నా పేరు మార్చటం మర్చిపోయాను. అందువల్ల యీ పిచ్చివాళ్లంతా నోటికి వచ్చినట్లు చెప్పుకుంటూ వచ్చారు."

"ఆఖరిసారి అడుగుతున్నా! ఇపుడైనా చెప్తావా లేదా?"

అపుడే వచ్చారు ఆమె బావగారు. నేను లేచి నిలుచున్నాను. తనూ లేచింది.

"బయలుదేరుతున్నావా?"

"నువ్వు నేనడిగినది చెప్పవా?"

తను ఒక చిఱునవ్వు నవ్వి తన బావగారిని క్రీగంట చూస్తూ—

"నిజం చెప్పాలా? నా చదువు యీ సంవత్సరంతో పూర్తయింది. వచ్చే నెలలో నా పెళ్ళి-అరుగో నాభర్త" అంది మెల్లిగా.

స్నేహ వాత్సల్యంతో మర్యాద చిహ్నంగా నా నుదుట కుంకుమ నుంచి, పువ్వూ పండ్లు నా చేతిలో వుంచి తన స్త్రీ ధర్మాన్ని నెరవేర్చింది. త్వరలో నే సుపుత్రుని కనమని దీవించాను. ఈ మాట ఆమెబావగారు విన్నారు కాబోలు, బయటకు వచ్చి, "పెళ్ళి కాకుండా నే నా" అన్నారు నవ్వుతూ! ముగ్గురము నవ్వుకొన్నాము.

నేను భానుమతి దగ్గర శలవు తీసుకొని యింటిముఖం పట్టాను. భానుమతి దగ్గరకు ఎంత హృదయభారంతో వెళ్లానో అంతకు రెటింపు సంతోషంతో తిరిగి యిల్లు చేరుకొన్నాను. ★